ప్రజాశక్తి
మంగళవారం 20 ఫిబ్రవరి 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మిలాన్ ఆరంభం

సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షిస్తున్న నేవీ సిబ్బంది

ఇప్పటికే 20 దేశాల నుంచి విశాఖకు నౌకలు రాక
తీరంలో రిహార్సల్స్ అదుర్స్

అంతర్జాతీయ నౌకాదళ దేశాలతో రక్షణ సంబంధాలు, సముద్ర భద్రత లక్ష్యంగా తూర్పు నౌకాదళం వేదికగా సోమవారం విశాఖలో మిలాన్ - 2024 ఆరంభమైంది. తొలి రోజు ప్రీ సెయిల్ డిస్కషన్స్ వంటి కార్యక్రమాలే సాగాయి. మిలాన్‌కు సంబంధించి 50 దేశాలకు ఇప్పటి వరకూ ఆహ్వానాలు అందగా 20 దేశాలకు చెందిన నౌకలు విశాఖ తీరానికి ఇప్పటికే చేరుకున్నాయి. ఇదిలా ఉండగా ప్రధాన వేడుకకు సన్నద్ధమవుతూ తీరంలో మూడో రోజైన సోమవారమూ రిహార్సల్ కొనసాగాయి. ఇవి నగర వాసులను ఒళ్లు గగుర్పాటుకు గురి చేశాయి.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

ప్యారాచూట్ విన్యాసాలు



మిలాన్‌కు విచ్చేసిన విదేశీ ప్రతినిధులు

పరిపాలనా రాజధాని పేర భూ దందాలు

- ఉమ్మడి విశాఖలో ఎక్కడి సమస్యలు అక్కడే
- శంఖారావం సభల్లో జగన్ సర్కారుపై లోకేష్ విమర్శలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, గాజువాక, సీతమ్మధార, మాధవధార, బుచ్చయ్యపేట, వడ్డాది విలేకరులు

పరిపాలనా రాజధాని పేరిట జగన్ సర్కారులో భూ దందాలు జరుగుతున్నాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. సోమవారం టిడిపి శంఖారావం సభలు విశాఖ ఉత్తరం, గాజువాక, అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో జరిగాయి. ఆయా చోట్ల లోకేష్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి మిగతా 2లో..

గాజువాకలో జరిగిన శంఖారావం సభలో నినాదాలు చేస్తున్న నారా లోకేష్, స్థానిక నాయకులు

ఆధునిక వసతులతో..

కెజిహెచ్‌లో పిల్లల వార్డు

విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో ఆధునిక వసతులతో ఐసియు పిల్లల వార్డును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఇప్పటికే వార్డు కన్వర్షన్ పనులు అక్కడ జరుగుతుండగా వాటిని ఆయన సోమవారం పరిశీలించారు. అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. నవజాత శిశు అత్యవసర వైద్య విభాగంలో చేపట్టిన పున:నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా పనులు చేపట్టాలన్నారు. పిల్లల వార్డుకు అవసరమైన అన్ని వైద్య పరికరాలనూ సిద్ధం చేయాలని, అవసరమైతే మరిన్ని నిధులను వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

ఆయా విభాగాల్లో ఎటువంటి లోటుపాట్లూ ఉండరాదని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులతో పాటు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని వైద్యులకు సూచించారు.

చిన్నారికి అవసరమైన వైద్యాన్ని అందిస్తాం

కెజిహెచ్ సందర్శనలో భాగంగా అక్కడ ఉన్న రోగులతో మిగతా 2లో..

జెకెసికి హెచ్ఒడిలు తప్పక హాజరుకావాలి

వార్త 2లో..

ఎన్నికలపై పూర్తిస్థాయి అవగాహన అవసరం

వార్త 2లో..

21న విశాఖకు సిఎం జగన్

వార్త 2లో..

'ఉక్కు' పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేసే వారికే ఓటేయాలి

దీక్షల్లో కూర్చున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం క్యుఎటిడి, టెలీ చిత్తశుద్ధితో పనిచేసే వారికే రానున్న కాలంలో ప్రజలు ఓట్లు వేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపు నిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1103వ రోజుకు చేరు కున్నాయి. దీక్షల్లో స్టీల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మిగతా 2లో..

చిరు వ్యాపారులపై జనసేన కార్పొరేటర్ దాడి

నిరసనకు దిగిన బాధితులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 22వ వార్డు పిఠాపురం కాలనీలో సంత ఏర్పాటు చేసుకొని చిన్న చిన్న వ్యాపారాలు నడుపుకుంటున్న వారిపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం దాడికి దిగారు. ఈ ప్రాంతం ప్రజల నుండి తనకు ఫిర్యాదులు అందాయని, కావున సంత నిర్వహించడానికి వీలులేదని ఆయన వ్యాపారులకు హుకుం జారీ చేస్తూ అప్పటికే పేర్చుకున్న సామాన్లను రోడ్డుపై చల్లి దౌర్జన్యానికి దిగారు. కొద్ది రోజులుపాటు తమకు ఇక్కడ వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రాధేయపడినప్పటికీ ఆయన కనికరించలేదు. వ్యాపారం చేస్తే తీసుకువచ్చి సామాన్లను తీసుకుని సహించేది లేదని, రెండు వాహనాలను వెళ్లిపోతానని మిగతా 2లో..

నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు, సిఐటియు నాయకులు

మొదటి పేజీ తరువాయి..

చిరు వ్యాపారులపై జనసేన కార్పొరేటర్ దాడి

బెదిరించారని పలువురు చిరు వ్యాపారులు మీడియా ఎదుట వాపోయారు. ఇదిలా ఉండగా కార్పొరేటర్ దౌర్జన్యాన్ని నిరసిస్తూ చిరు వ్యాపారులు సాయంత్రం నాలుగు గంటల నుంచి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాము 2014 నుంచి సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన హ్యాకర్ జోన్‌లోనే వ్యాపారం చేసుకుంటున్నామని, దీనిని ఉన్నపలంగా తొలగించాలని చెప్పడం అన్యాయని అన్నారు. ఈ వ్యాపారాలపైనే తాము జీవనోపాధి సాగిస్తున్నామని తెలిపారు.

దాడిని ఖండించిన సిఐటియు

చిరు వ్యాపారులపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ దాడిని సిఐటియు నాయకులు పి.వెంకటరావు, వి.కృష్ణారావు ఖండించారు. చిరు వ్యాపారులు పది సంవత్సరాలుగా ఇక్కడ ఒక్కరోజు సొంత నిర్వహించుకుంటున్నారని తెలిపారు. రకరకాల వస్తువులను, కూరగాయలను సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అతి తక్కువ ధరలకు అందిస్తున్నారని తెలిపారు. వారంతా వీధివిక్రయదారుల పరిధిలోకి వస్తారని గుర్తుచేశారు. జనసేన కార్పొరేటర్ ప్రజల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదని తెలిపారు. ప్రభుత్వంతో పోరాడాల్సిన స్థాయిలో ఉండి ఇలా వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు.

పిల్లల వార్డులో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆధునిక వసతులతో కెజిహెచ్‌లో పిల్లల వార్డు

జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, వసతులపై వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలం లంబసింగి గ్రామానికి చెందిన మారిన సత్యవతి తన ఏడాది కుమార్తె అయిన గౌరీశ్రీకి పుట్టుకతోనే కాళ్లు, చేతులు లేవని, తన బిడ్డను ఆదుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన చిన్నారికి అవసరమైన పూర్తి వైద్యాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, పలు విభాగాల వైద్యులు ఉన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేసే వారికే ఓటేయాలి

కమ్యూనికేషన్, ఇటిఎల్, డిఎన్‌డబ్ల్యు విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు యు.రామస్వామి మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఎంతోమంది ప్రచార నిమిత్తం ఇక్కడికి వస్తున్నప్పటికీ స్టీల్‌ప్లాంట్ విషయంలో చిత్తశుద్ధితో ఎవరూ మాట్లాడటం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటానికి అండగా నిలిచేవారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకుంటే బిజెపికి రానున్న కాలంలో తగిన శాస్తి జరగనుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, వైవి.రమణ, సురేష్ పాల్గొన్నారు. సిపిఎం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి బలరాం ఉక్కు దీక్షలకు సంఘీభావం ప్రకటించారు.

ఎన్నికలపై పూర్తిస్థాయి అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, అందుకు శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. లోక్‌సభ పరిధిలోని శాసనసభ నియోజకవర్గ ఎఆర్‌ఒలకు రెండో విడత శిక్షణ కార్యక్రమం సోమవారం ఉదయం ఎయు కెమికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనీలు ఎస్‌కె. సేథియా, డాక్టర్ మొహమ్మద్ రెహన్ రాజా, అతీక్ అహ్మద్‌లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్నాయని, అందుకు ఎన్నికల అధికారులకు పూర్తిస్థాయి అవగాహన అవసరమని అన్నారు. ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని, తద్వారా ఎఆర్‌ఓలు తమ సందేహాలను నివృత్తి చేసుకోగలిగారని గుర్తు చేశారు. ఈసారి కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా జారీచేసిన మార్గదర్శకాలు, సూచనలను తుచ తప్పక పాటిస్తూ అధికారులు ముందుకు వెళ్లాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు జాతీయస్థాయి మాస్టర్ ట్రైనీలు వచ్చారని, వారి శిక్షణలో ఎన్నికలు ప్రారంభం నుంచి ముగిసే వరకు కొనసాగాల్సిన పూర్తి ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి, పాడేరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల జాయింట్ కలెక్టర్లు పాల్గొన్నారు.

జెకెసికి హెచ్‌ఒడిలు తప్పక హాజరుకావాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం (జెకెసి) కార్యక్రమానికి జిల్లాలోని హెచ్‌ఒడిలు తప్పని సరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన, దిగువ స్థాయి సిబ్బందిని పంపినా సంబంధిత శాఖాధిపతులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన సోమవారం ఉదయం జెకెసి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, డిఎల్‌డిఒ, పోలీస్, జివిఎంసి అధికారులు భాగస్వాములై జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి 140 అర్జీలు అందగా, అందులో 67 వినతులు జివిఎంసివి, 17 వినతులు పోలీస్ శాఖవి, 56 వినతులు ఇతర శాఖలవి ఉన్నాయి. ప్రజల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం జగనన్నకు చెబుదాం అని అన్నారు. ఇందులో వచ్చిన వినతులపై జిల్లా శాఖాధిపతులు నిబద్ధతతో పని చేసి పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ అర్జీలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలకు సరైన పరిష్కారం చూపనందునే అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని అన్నారు

22న మద్యం, గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిఒడబ్ల్యు అర్ధ శతాబ్ది వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు. అందులో భాగంగా ఈనెల 22న ఉదయం 10 గంటలకు విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో మద్యం, గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు.

21న విశాఖకు సిఎం జగన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నెల 21వ తేదీన విశాఖలో పర్యటించనున్నారని ముఖ్యమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా జగన్మోహన్ రెడ్డి ఆ రోజు ఉదయం 10:20 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 11:20 గంటలకు విశాఖ చేరుకుంటారని, అక్కడ నుండి రోడ్డు మార్గంలో 11:40 గంటలకు పెందుర్తిలోని శారదా పీఠానికి వస్తారని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన విశాఖ శ్రీ శారదా పీఠం రాజ శ్యామల అమ్మవారి దర్శనంలో పాల్గొంటారని వెల్లడించారు.అనంతరం 12:40 గంటలకు అక్కడి నుండి బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుని మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో బయలుదేరి 1:50 గంటలకు గన్నవరానికి చేరుకుంటారు.

పరిపాలనా రాజధాని పేర భూ దందాలు

(మొదటి పేజీ తరువాయి..) వస్తే తుమ్మపాల రైతులకు న్యాయం చేస్తామని, ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటిని కుళాయి ద్వారా సరఫరా చేస్తామని అన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా బాధ్యత తీసుకుంటామన్నారు. విశాఖ కొండవాలు ప్రాంతాల్లో నివసించే వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజల జీవితాలతో ఇప్పటి వరకూ జగన్ ఓ ఆట ఆడారని, రెండు నెలల్లో ప్రజలు జగన్‌ను ఫుట్‌బాల్ ఆడుకుంటారని అన్నారు. విశాఖను ఆయన గంజాయి క్యాపిటల్‌గా మార్చేశారని విమర్శించారు. జగన్ పాలనలో విశాఖలో రోజుకో కిడ్నాప్, విధ్వంసం, మర్డర్ జరుగుతున్నాయన్నారు. రాప్తాడులో ఫొటో జర్నలిస్టుపై దాడిని లోకేష్ ఖండించారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే ఎపి రెండో స్థానంలోనూ, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలోనూ ఉందన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, మెగా డిఎస్‌సి, గ్రూప్-1, 2 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి జగన్ మోసం చేశారన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని తెలిపారు. సొంత తల్లి, చెల్లి కూడా జగన్‌ను నమ్మడం లేదన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయాన్నే ఆయన మరిచారన్నారు. తాము అధికారంలోకి వస్తే

వడ్డాదిలో శంఖారావం సభకు హాజరైన టిడిపి కార్యకర్తలు

అగనంపూడి టోల్‌గేట్, గంగవరం, ఎపిఐఐసి నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పోర్టు కాలుష్యాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చారు. చోడవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి తెలుగుదేశం - జనసేన కృషి చేస్తాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని మంజూరు చేసి పనులు ప్రారంభించామని, వాటిని వైసిపి సర్కారు తుంగలో తొక్కిందని అన్నారు. చక్కెర రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చోడవరంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు, బుద్ధ నాగజగదీశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, దాడి వీరభద్రరావు, ప్రగడ నాగేశ్వరరావు, దాడి రత్నాకరరావు, బత్తుల తాతయ్యబాబు, కెఎస్‌ఎన్‌ఎస్.రాజు, గూడూరు మల్లనాయుడు, జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు, పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేపల్లి రఘు, పరుచూరి భాస్కరరావు, పిబిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు టిడిపి సిద్ధంగా ఉందని, వైసిపి సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ సవాల్ విసిరారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వయస్సుకు గౌరవం ఇవ్వకుండా చంద్రబాబుపై విమర్శలు చేయటం సమంజసం కాదన్నారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చకు రాగలరా అని అన్నారు. ఫ్యాన్ రెక్కలు విరిగిపోయే రోజులు దగ్గరకు వచ్చాయని జోష్యం చెప్పారు. ఒక్క ఛాన్స్ అడిగి రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టారని, ప్రశ్నించిన ప్రతిపక్షాలపై కక్ష సాధించుకోడానికే సమయం వెచ్చించారని మండిపడ్డారు. రాప్తాడులో మీడియా ఫోటోగ్రాఫర్‌పై దాడికి తెగబడ్డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

విశాఖ మ్యూజియం నిర్వహణను పటిష్టపరచండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహావిశాఖ నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విశాఖ మ్యూజియం నిర్వహణను మరింత పటిష్ట పరచాలని అధికారులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం ఆయన అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలసి విశాఖ మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరంలో ప్రతిష్టాత్మకంగా జరుగుచున్న మిలాన్ 2024 కార్యక్రమాలకు వివిధ దేశాల ప్రతినిధులు విశాఖ నగరానికి విచ్చేయుచున్నందున సందర్శనార్థమై విశాఖ మ్యూజియానికి మరమ్మతులు చేపట్టి పున:ప్రారంభించామన్నారు. ఆధునికీకరించిన మారిటైమ్, హెరిటేజ్ మ్యూజియం పనులను పరిశీలించారు.

యుఎల్‌సి 74/2024
తేది: 06-02-2024

తహాశీల్దార్ వారి కార్యాలయము
గాజువాక

పత్రికా ప్రకటన

విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం మండలం, అల్లిపురం, డో.నెం.32-10-37, కాపురస్తులు, శ్రీ బెహరా సత్యారావు (లేటు) గారి కుమారుడు శ్రీ బెహరా రవికుమార్ పట్నాయక్, కార్యదర్శి, శ్రీ పవనపుత్ర నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ గారు ఈక్రింది పట్టికలో తెలిపిన భూమికి (NOC) నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయవలసిందిగా కోరియున్నారు.

గ్రామము పేరు	మండలం	సర్వే నెం	విస్తీర్ణము
జగ్గరాజుపేట	గాజువాక	95/1ఎ	23,840.27 చదరపు గజములు (లేదా 19,933.497 చదరపు మీటర్లు)

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయుటకు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన అందిన 15 దినములలోగా శ్రీ తహాశీల్దారు, గాజువాక వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసిందిగా కోరడమైనది.

తహాశీల్దార్
గాజువాక, విశాఖపట్నం

సబ్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ సబ్‌స్టేషన్‌లో పనిచేసిన ఎఇ గత ఏడాది జూన్ నెలలో బదిలీఅయ్యారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆ శాఖకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎఇ లేక 9 నెలలు అవుతున్నా విద్యుత్ శాఖ అధికారులు కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడంలేదు. గతంలో ఎఇగా పనిచేసిన సురేష్ ముందు ఇక్కడికి రావడానికి మొగ్గు చూపినా మరలా ఎందుకో నిరాకరించారని కొందరు విద్యుత్ అధికారులు చర్చించుకుంటున్నారు. సబ్ స్టేషన్‌లో సబ్ ఇంజినీర్‌గా రమేష్ పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈయనే ఈ సబ్‌స్టేషన్‌కు పెద్ద దిక్కుగా ఉన్నారు. ఆయనపై పనిభారం పెరుగుతోంది.

మండలంలోని 22 పంచాయతీలకు ఒక లైన్‌మ్యాన్, ఎఎల్‌ఎం జెఎల్‌ఎం ఒక్కొక్కరు, సచివాలయ గ్రేడ్-2 జెఎల్‌ఎంలు 8 మంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇద్దరు పనిచేస్తున్నారు. 22 పంచాయతీలకు సంబంధించి ఇంత తక్కువ సిబ్బంది మాత్రమే ఉండటంతో విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు వేగంగా పరిష్కారం కావడంలేదు. మండలంలోని రెడ్డిపల్లి, మద్ది, గందవరం, అనంతవరం, పాండ్రంగి వంటి పంచాయతీల్లో ఒక్కరే పని చేయడం కష్టంగా ఉందని విద్యుత్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2000 సర్వీసులు ఉన్న గ్రామాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పనులు నెట్టుకొస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు, అధికంగా లోడు వచ్చినప్పుడు కూడా అవుట్ సోర్సింగ్ సిబ్బందే పనులు చేయాల్సి ఉంటుంది. వారి వద్ద ఎటువంటి అధికారులూ ఉండరు. అన్ని అధికారాలు ఉన్న డిపార్ట్‌మెంట్ లైన్‌మ్యాన్‌ను నియమిస్తే కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయని వినియోగదారుల అభిప్రాయం పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

‘ఉపాధి హామీ’ పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పద్మనాభం పంచాయతీలో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ సోమవారం ఎంపిడిఒకు పాండ్రంగి పంచాయతీ 1వ వార్డు సభ్యులు మహంతి అప్పలరమణ (శ్రీనివాసరావు) స్పందనలో వినతిపత్రం అందజేశారు. పంచాయతీలోని ఆరు గ్రామాల్లో 5000కుపైగా ఉన్న జనాభాలో సుమారు 2500 మందికిపైగా ఉపాధి వేతన దారులు ఉన్నారని, ఉపాధి హామీ పథకం ద్వారా వారికి పని కల్పించాలని కోరారు. పంచాయతీలోని కురపల్లి గ్రామంలో చెరువు, పాండ్రంగి గ్రామంలో చిరుత చెరువు, పాండ్రంగి గ్రామ చెరువుకు నీరు వచ్చే దివాంజి కాలువలో గత నాలుగేళ్లుగా పూడిక తీయలేదని వివరించారు. తక్షణమే గ్రామ పంచాయతీ ప్రజలకు పని కల్పించాలని కోరారు. పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెంలో కూడా పనులు కల్పించాలని కోరారు. వినతి అందించిన వారిలో హంస మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంస్య పతకాలతో విద్యార్థులు

కిక్ బాక్సింగ్‌లో గీతం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ (వాకో) ఆధ్వర్యాన ఇటీవల దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థులు అష్నా, టి.సుభాష్ కిషోర్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలను సాధించారని క్రీడా విభాగం డైరక్టర్ డాక్టర్ యు.విజయ కుమార్ తెలిపారు. జాతీయ పోటీలలో ప్రతిభ కనబరచడం ద్వారా అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు సైతం అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానందసిద్ధవట్టం, రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్ తదితరులు అభినందించారు.

స్పందనకు ఒక అర్జీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మికి యుసిడి విభాగానికి సంబంధించి ఒకే ఒక అర్జీ అందింది. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత విభాగం అధికారికి అర్జీని పంపినట్లు జెడ్సీ తెలిపారు.

ఉక్కు ఉద్యోగి మృతికి నివాళి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇటీవల మృతి చెందిన స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్‌ఎం విభాగం జనరల్ ఫోర్‌మెన్ ఎస్.వెంకటనారాయణకు పలువురు ఉద్యోగులు నివాళులర్పించారు. వెంకటనారాయణ సంస్మరణ సభ సోమవారం ఎంఎంఎస్‌ఎం విభాగంలో నిర్వహించారు. వెంకట నారాయణ మృతికి అధికారులు, ఉద్యోగులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం విభాగాధిపతి సైబాల్ సేన్ మాట్లాడుతూ, వెంకటనారాయణ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ తోటి ఉద్యోగులతో అన్యోన్యంగా ఉండేవారని కొనియాడారు. కార్యక్రమంలో విభాగం ఇన్‌ఛార్జి కృష్ణప్రసాద్, అధికారులు గరిటయ్య, బానోత్ గణేష్, పార్థసారథి, కెవిడి.ప్రసాద్, కార్మిక నాయకులు కెఆర్‌కె.రాజు పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిల్లపేట – చిట్టివలస పెద్ద చెరువు సుందరీకరణ పనులను జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి సోమవారం పరిశీలించారు. 25 ఎకరాల విస్తీర్ణంలో సంబంధిత చెరువును రూ.6.50 కోట్లతో ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యాన చెరువు పునరుద్ధరణ పనులు గతేడాది జులైలో ప్రారంభమైన విషయం విదితమే. పనులు నత్తనడకన జరుగుతుండడంతో చెరువు పనుల్లో వేగం పెంచాలని స్థానికులు కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జీరుపేటలో కాల్వలను పరిశీలించారు.

చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి

కరాటేలో ‘సంస్కృతి’ విద్యార్థుల రాణింపు

ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి - పద్మనాభం : మండలంలోని కొత్త కొవ్వాడ పంచాయతీ శివారులో ఉన్న సంస్కృతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలంలో ఈ నెల 18న విక్టరీ షటోకాన్ కరాటే అసోసియేషన్ డూ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ కరాటే శిక్షకులు పి.శ్రీనివాసరాజు ఆధ్వర్యాన నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌కు ఈ పాఠశాల నుండి 14 మంది విద్యార్థులు పోటీపడ్డారు. వీరిలో ఎనిమిది మంది పసుపు బెల్టులు సాధించగా, మరో ఇద్దరు ఆరంజ్ బెల్టులు కైవసం చేసుకున్నారు. 4, 5 తరగతి చదువుతున్న ఎన్ జనార్ధననాయుడు, జి.రాజేశ్వరిఅనన్యలు గ్రీన్ బెల్టులు, 5, 6 తరగతుల విద్యార్థులు ఎల్.జస్విత, ఎస్.లోసికలు బ్రౌన్ బెల్టులు సాధించారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ వాడపల్లి సాయికృష్ణరాజు సోమవారం ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ రామరాజు, ప్రిన్సిపల్ ఎం.జగదీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేష్ వ్యాఖ్యలపై వైసిపి నిరసన

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి శంఖారావం సభలో వైసిపిపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక వైసిపి యువజన విభాగం ఆధ్వర్యాన భీమిలి ఎండిఒ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ, అధికారంలో ఉండగా భూములను ఆక్రమించుకున్న చరిత్ర టిడిపి పెద్దలకే దక్కుతుందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంక్షేమం కోసం టిడిపి ఏనాడూ ఆలోచించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు బి.హరికిరణ్‌రెడ్డి, మూడో వార్డు అధ్యక్షులు ఎం.కృష్ణ, వెంకటేష్, రాజశేఖర్, భాను తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో నిరసన తెలుపుతున్న వైసిపి యువజన విభాగం ప్రతినిధులు

ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గీతం ప్రతినిధులు

గీతంలో ఛత్రపతి శివాజీ జయంతి

ప్రజాశక్తి -మధురవాడ : పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ 394వ జయంతిని సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. భారతీయతను, దేశభక్తిని నిండుగా కలిగి ఉండి నాయకత్వ లక్షణాలతో మొఘల్ దాడుల నుంచి మరాఠా ప్రాంతాన్ని రక్షించుకోవడంలో అసమాన పోరాట పటిమను కనబరిచిన శివాజీ చిరస్మరణీయుడని గీతం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం పేర్కొన్నారు. గీతం ఆవరణలోని శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. దేశ భక్తి, విజయ సాధనపై పోరాట పటిమను విద్యార్థులు చత్రపతి శివాజీ నుంచి స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ కె.నాగేంద్ర కుమార్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. శిరీష, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జివి రమణను సత్కరిస్తున్న ముత్తంశెట్టి మహేష్ తదితరులు

జివి రమణకు సత్కారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మాజీ మున్సిపల్ కౌన్సిలర్, జివిఎంసి ఒకటో వార్డు సంతపేటకు చెందిన జివి.రమణను వైసిపి ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో అతన్ని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పార్టీ తన సేవలను గుర్తించి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జివి.రమణను సత్కరించిన వారిలో వైసిపి నియోజకవర్గ ఇంఛార్జి ముత్తంశెట్టి మహేష్, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్లు జగుపిల్ల ప్రసాద్, కె.ఎల్లాజీ, పార్టీ నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు ఎస్.ప్రసన్న ఉన్నారు.

ఎయును సందర్శించిన యూరోపియన్ కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని యూరోపియన్ కమిషన్ సభ్యులు సోమవారం సందర్శించారు. ఎయులో యూరోపియన్ కమిషన్ సహకారంతో మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో నిర్వహిస్తున్న పరిశోధన ప్రాజెక్టుల ప్రగతి, పనితీరును పరిశీలించారు. అనంతరం వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో స్పెయిన్‌లోని ఒవిడో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జోస్ అకునా, సైప్రస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జార్జియోస్ జార్జియో, గ్రీస్‌లోని అర్కిపెలోగోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెరైన్ కన్జర్వేషన్‌కు చెందిన డాక్టర్ బిట్రీజ్ టింటోర్‌లు భేటీ అయ్యారు. ఎయులోని పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం తమకు ఎంతో నచ్చిందని వీసీ ప్రసాదరెడ్డికి తెలియజేశారు. నూతన ఆలోచనలతో పనిచేసే దిశగా యూరోపియన్ కమిషన్ సభ్యులను వీసీ ప్రసాదరెడ్డి ఆహ్వానించారు. ఎయులో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న స్టార్టప్ ఎకోసిస్టం, సిఒఇ తదితర వసతులను, శాస్త్ర, పరిశోధన రంగాలతో పాటు ఎయు కళలు, సోషల్ సైన్సెస్‌కి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న విధానాన్ని వారికి వివరించారు. ఎయుకు ప్రత్యేకతను తీసుకువచ్చే విధంగా నిర్వహిస్తున్న ఫైన్ ఆర్ట్స్, డాన్స్-మ్యూజిక్, డాల్బీ స్టూడియో వంటి వసతుల గురించి వారికి వివరించారు. ఎయు యోగా కేంద్రాన్ని తాము సందర్శిస్తామని ప్రొఫెసర్ జార్జియోస్ కోరారు. యోగా విలేజ్‌ను సందర్శించడం, ఆక్కడ అందించే ప్రత్యేకమైన సహజ ఆహారాన్ని సైతం వారికి అందించే ఏర్పాట్లుచేయాలని అధికారులకు వీసీ సూచించారు. అనంతరం యూరోపియన్ కమిషన్ ప్రతినిధులను వర్సిటీ తరపున సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య పి.జానకీరామ్, ఆచార్య ఉమాదేవి పాల్గొన్నారు.

బూతులు మాట్లాడే నేతలకు బుద్ధిచెప్పండి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-సీతమ్మధార : బూతులు మాట్లాడే రాజకీయ నాయకులకు పోలింగ్‌బూత్‌లో బుద్ధి చెప్పాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్‌ స్కూల్‌ గోల్డెన్‌ జూబ్లీ వేడుకల ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో కొంతమంది అపహాస్యపనులు చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకులు స్థాయి మరచి చౌకబారు మాటలు మాట్లాడకూడదని హితవుపలికారు. చదువు ఎంత ముఖ్యమో సంస్కారం కూడా అంతే ముఖ్యమన్నారు. మాతృభాషను ఎవరూ మర్చిపోకూడదన్నారు. మాతృభాష కళ్ల లాంటివని, పరాయి భాష కళ్లద్దాలు వంటివి అని చెప్పారు. విలువలతో కూడిన విద్య ద్వారా మంచి పౌరులు తయారవుతారన్నారు. దేశంలో ఉన్న మేధాశక్తి వల్ల ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తుందన్నారు. గూగుల్‌ గురువుని మించింది కాదని తెలిపారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించిన రోజున విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతంలో కెకె.రాజు పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి రాంజీ ఎస్టేట్‌ కొండవాలు ప్రాంతంలో స్టాండింగ్‌ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరితో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పర్యటించారు. అనంతరం రాంజీ ఎస్టేట్‌ గ్రామ సేవా సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, త్వరలో గ్రామంలో కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం, కొండవాలు ప్రాంతంలో మెట్లు, డ్రైయిన్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గురువాజి, సుకుమార్‌, నరసింగ్‌, రమేష్‌, భోగి, అనిల్‌, సాయి, సుధాకర్‌, ఎల్లాజి, బుల్లి బాబు, జయకుమార్‌, కనకరాజు, రాంజీ ఎస్టేట్‌ గ్రామ సేవా సంఘం ప్రెసిడెంట్‌ వై.ప్రసాద్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ మహేష్‌, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసమే విద్య లక్ష్యం

ప్రజాశక్తి -ములగాడ : విద్య లక్ష్యం వ్యక్తిత్వ వికాసం అని, అందుకు ఆటలు, పాటలు, సామాజిక సేవా కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు, పుస్తక పఠనం ఎంతగానో తోడ్పడతాయని సెయింట్‌ ఆన్స్‌ కళాశాల కరస్పాండెంట్‌ సిస్టర్‌ గెసిల్లా అన్నారు. స్థానిక సెయింట్‌ ఆన్స్‌ జూనియర్‌ కళాశాల సీనియర్‌ విద్యార్థినుల ప్రత్యేక వీడ్కోలు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సెయింట్‌ ఆన్స్‌ కళాశాలలో వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని సదుపాయాలు, అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్‌ సిస్టర్‌ జానిస్‌, సుపీరియల్‌ సిస్టర్స్‌ జయశీల, ఎల్సీ తదితరులు ఇంటర్మీడియట్‌ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ రకాల కోర్సులను గురించి తెలియజేశారు. అనంతరం ఇంటర్మీడియట్‌ స్థాయిలో జాతీయ సేవా పథక కార్యక్రమాలలో, క్రీడల్లో, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్‌ అధికారి ఇపిఎస్‌.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు నదియా, సంధ్య, అనసూయ, ప్రేమలత, అబీదా, ఆదిలక్ష్మి, సుధ, జగన్‌, పరమేష్‌, సలోమీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న టిడిపి కార్యకర్తలు

500 మంది రక్తదానం

ప్రజాశక్తి -గోపాలపట్నం : మాజీ ఎంపీ కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పలనరసింహ 88వ జయంతిని పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు స్వగృహంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా అప్పలనరసింహం విగ్రహానికి విశాఖ పార్లమెంట్‌ నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త ఎం.శ్రీభరత్‌ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో సుమారు 500 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు బ్లడ్‌ డొనేషన్‌ సర్టిఫికెట్లను శ్రీభరత్‌ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్‌, యువ నాయకుడు మౌర్యసింహ, తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా సమావేశాలను విజయవంతం చేయాలి

కొమ్మాదిలో పోస్టర్‌ను విడుదలచేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను విజయవంతంచేయాలని కోరుతూ విశాఖలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు.

మధురవాడ : జాతీయ కార్యవర్గ సమావేశాల నేపథ్యంలో ముద్రించిన పోస్టర్లను ఐద్వా మధురవాడ జోన్‌ కమిటీ ఆధ్వర్యాన కొమ్మాది కూడలిలోని సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం జోన్‌ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐద్వా మధురవాడ జోన్‌ కార్యదర్శి బి.భారతి మాట్లాడుతూ, ఈ సమావేశాల సందర్భంగా 22వ తేదీన సరస్వతి పార్కు నుంచి భారీ ప్రదర్శన, సెంట్రల్‌ పార్కు వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని జయప్రదంచేయాలని కోరారు. 87 సంవత్సరాల నుంచి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డి.కొండమ్మ, కె.కుమారి, టికె.శారద తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఈనెల 23 నుండి 25 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ సమావేశాల బ్యానర్‌ను మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ మహిళలు ఐద్వా ఆధ్వర్యాన ఎన్నో పోరాటాలు చేసి ఆస్తి హక్కు చట్టం, అత్యాచార నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, లైంగిక నిరోధక చట్టం, నిర్భయ చట్టం వంటి చట్టాలను సాధించుకున్నారని తెలిపారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో విశాఖపట్నంలో జరుగుతున్న ఐద్వా జాతీయ సమావేశాలకు మహిళా కార్మికులు, విద్యార్థినులు, యువతులు, మేధావులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వరలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉప్పాడ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్‌ : మహిళల హక్కుల పరిరక్షణకు, భవిష్యత్‌లో మరెన్నో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని, వాటికి మార్గనిర్దేశం చేయడం, కార్యాచరణ రూపొందించడానికి, మహిళల్లో చైతన్యం పెంచేందుకు ఐద్వా జాతీయ సమావేశాలు దోహదపడతాయని ఐద్వా నేతలు అన్నారు. ఈ నెల 22నుండి25వరకు విశాఖపట్నంలో నిర్వహించే ఐద్వా జాతీయ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 22న విశాఖలో బహిరంగ సభలో జాతీయ నాయకులు పాల్గొంటున్నారన్నారు. బహిరంగ సభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్‌ గౌరి, కోశాధికారి కెవి. సూర్యప్రభ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె ప్రసన్న, అంగన్‌వాడీల యూనియన్‌ ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు వి సామ్రాజ్యం పాల్గొన్నారు.

సబ్బవరంలో సమావేశాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

నర్సీపట్నంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

హామీలను అమలు చేయాలని ధర్నా

గాజువాక జోనల్‌ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్‌ కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : సమ్మె కాలంలో పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని కోరుతూ గాజువాక జోనల్‌ కార్యాలయం ఎదుట కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు గొలగాని అప్పారావు మాట్లాడుతూ, 2023 డిసెంబర్‌ 26 నుంచి 2024 జనవరి 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్‌/అవుట్‌ సోర్సింగ్‌ కార్మికులను పర్మినెంట్‌ చెయ్యాలని, లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్లతో రాష్ట్రమంతా సమ్మె చేయగా జరిగిన ఒప్పందాలను నేటికీ అమలు చేయలేదన్నారు. సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, డెత్‌, సిక్కు, లాంగ్‌ ఆబ్సెంట్‌ కార్మికుల స్థానాల్లో వారసులను భర్తీ చెయ్యాలని డిమాండ్‌చేశారు. స్వతంత్ర నగర్‌ డంపింగ్‌ యార్డులోకి ఇతరులను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆప్కాస్‌లో 2021 విలీనం కాకముందు జులై నుంచి డిసెంబర్‌ వరకు బకాయి హెల్త్‌ అలవెన్స్‌, జీతాలు, చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ (సిఐటియు) నాయకులు గొల్ల రాము, గణేష్‌, నక్క నాగరాజు, మీనాక్షి, కె.కిరీటం, రవణ, సత్యవతి పాల్గొన్నారు. ధర్నా అనంతరం జోనల్‌ కమిషనర్‌ సన్యాసినాయుడుకు వినతిపత్రం అందజేశారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి ధర్మానగర్‌ ప్రాంతంలో రూ.19.80 లక్షలతో నిర్మించిన నూతన సామాజిక భవనాన్ని వార్డు కార్పొరేటర్‌ కెవిఎన్‌ శశికళ ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రజలకు సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అంగనవాడీ కేంద్రాలు, సామాజిక భవనాలను కూడా నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ కటుమూరి సతీష్‌, రత్నాకర్‌, ఎడ్ల సిద్ధార్థ, గంగ మహేష్‌, దుప్పలపూడి శ్రీను, సొండి సురేష్‌, బి శివప్రసాద్‌, మహేశ్వరరెడ్డి, వైవిఎన్‌.రాజు, కరుణ, జివిఎంసి అధికారులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్‌

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్‌ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అందుకోలేని లక్ష్యాలను నిర్దేశించొద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార: వార్షిక పరీక్షల్లో అందుకోలేని లక్ష్యాలను నిర్దేశించకుండా ప్రశాంత వదనంతో విద్యార్థులు ముగించేలా తర్ఫీదునివ్వాలని వక్తలు పేర్కొన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ ఆధ్వర్యాన సోమవారం జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లీష్‌ మీడియం స్కూల్లో వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్‌ టీచర్స్‌ అసోసియేషన్లతో పరీక్షపై చర్చ 2024 పేరిట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ, పరీక్షలు రాసే విద్యార్థుల్లో మార్కులే లక్ష్యం కాకూడదని, వారిలో ఆందోళనలు, అభద్రతాభావం లేకుండా ముందస్తుగా రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో సంబంధిత నిపుణులతో అవగాహనా కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల ఒత్తిడితో ఏ విద్యార్థి ప్రాణాలు కోల్పోకుండా ఉండాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామన్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ కో-ఆర్డినేటర్‌ కె.చిట్టిబాబు మాట్లాడుతూ, విద్యార్థుల ఒత్తిడిని దూరం చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారితో అధిక సమయం వెచ్చించాలని, ఒత్తిడి లేని భరోసా, భద్రతపై అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషించాలని పవర్‌ పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ద్వారా వివరిస్తున్నామని తెలిపారు.

విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్‌.చంద్రకళ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ ఆదేశాలు, సూచనలతో జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని విడనాడి స్థైర్యం, ధైర్యం నింపి ప్రశాంత వదనంతో ముందడుగువేసేలా తర్ఫీదునిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకరరావు, ఎపిసి.శ్రీనివాస్‌, డిసిపి యుపిఒఐసి ఎం.రమేష్‌, డైట్‌ భీమిలి లెక్చరర్‌ త్రినాథరావు సారిపల్లి, గర్ల్‌ చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ ఖలీషా బేగం, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆర్ఎఆర్ఎస్ వద్ద కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రోజువారీ కూలీలుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక కొనసాగుతోంది. కాంట్రాక్టరు కొంత మంది ఇతర కార్మికులను తీసుకురాగా కార్మికులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్ఎఆర్ఎస్ వద్ద కార్మికులు చేపట్టిన ఆందోళన రెండో రోజుకు చేరింది. సోమవారం శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షులు గంట శ్రీరామ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ బలవంతంగా పోటీ కార్మికులను తీసుకొస్తే సహించేది లేదని హెచ్చరించారు. లేబర్ కమిషన్ ఆర్డర్ ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, రాష్ట్ర కార్మిక శాఖ జారీ చేసిన జాతీయ పండుగ సెలవులు (వేతనంతో కూడిన) కాంట్రాక్ట్ లేబర్ అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం చెల్లించేందుకు జారీ చేసిన జీవోను కాంట్రాక్ట్ లేబర్‌కు కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశంలో కార్మికులు పాముకాటుకు, ఇతర ప్రమాదాలకు గురైనప్పుడు రీసెర్చ్ స్టేషన్ అధికారులు బాధ్యత తీసుకొని వైద్యం చేయించాలని, యూనివర్సిటీ పరిధిలో ఖాళీ పోస్టుల భర్తీలో కాంట్రాక్ట్ కార్మికులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కొణతాల సంతోష్ కుమార్, ఇసరపు లక్ష్మి, మళ్ళ లక్ష్మి, నక్కా మంగాదేవి, పల్లా రమాదేవి, వెంకటలక్ష్మి, చందక లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఆర్ఎఆర్ఎస్ కాంట్రాక్టు కార్మికులు

స్పందన అర్జీల సమాధానం సంతృప్తిగా వుండాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

స్పందన కార్యక్రమంలో సమర్పించే దరఖాస్తులు, ఫిర్యాదులకు తెలిపే సమాధానాలు సంతృప్త స్థాయిలో వుండాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కాకుండా కలెక్టర్ బి. స్మరణ్ రాజ్, భూసర్వే సహాయ సంచాలకులు ఎస్.గోపాలరాజు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. తిప్పి పంపే దరఖాస్తు, ఫిర్యాదుపై ముక్తసరిగా కాకుండా తిరస్కరణ గూర్చి వివరంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సిఈఓ పోలినాయుడు, డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ.హేమంత్, జిల్లా పంచాయితీ అధికారి ఆర్.శిరీషారాణి, జిల్లా ట్రెజరీ అధికారి వి.లక్ష్మి సభాషిణి, బిజెఆర్ సుజల స్రవంతి ఎస్‌డిసి కె.రమామణి, సిపివో జి.రామారావు, విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డ్వామా పిడి ఈ.సందీప్, పిఆర్ ఈఈ వీరునాయుడు, డిఎస్ఓ కెవిఎల్ఎన్.మూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్యమ్మ, స్త్రీ శిశుసంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, సంక్షేమ శాఖ డిడిలు కె.రాజేశ్వరి, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

అచ్యుతాపురం : వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో పూడిమడక గ్రామానికి వచ్చి మత్స్యకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ మత్స్యకార నాయకుడు తోడుపెళ్లి అప్పారావు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఏపీఐఐసీ పైప్లైన్ బాధిత మత్స్యకార కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం చెల్లిస్తానని, ఇంటికొక ఉద్యోగం ఇప్పిస్తానని ఆయన అప్పట్లో హామీ ఇచ్చారని అప్పారావు గుర్తు చేశారు. నేటి వరకు ఆ హామీలు నెరవేరలేదని, ఇప్పటికైనా హామీని వెంటనే అమలాపరచాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి పేర్కొన్నారు. మండలంలోని శంకరం గ్రామంలో కోటీ 50 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న సామాజిక సాంస్కృతిక భవనానికి వారు సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే వెంకుపాలెం గ్రామంలో అరబిందో కంపెనీ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరు దిలీప్ కుమార్, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, పెద్దిశెట్టి గోవింద, శంకరం, వెంకుపాలెం సర్పంచులు పసుపులేటి లక్ష్మి రామకృష్ణ, రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేశ్వరరావు, అరబిందో కంపెనీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



కశింకోట మండలంలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

బహుళ సామాజిక భవనాలు ప్రారంభం

కశింకోట : కశింకోట మండలం ఉగ్గినిపాలెం, కశింకోట గ్రామాల్లో ఆరోబింద్ ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన బహుళ సామాజిక భవనాలను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి అమర్నాథ్ గుడివాడ అమర్నాథ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శుభ కార్యాల కోసం అవసరమైన సామాజిక భవనాలకు అరబిందో యాజమాన్యం నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, వైసిపి నియోజకవర్గం సమ్వయకర్త మలసాల భరత్ కుమార్, ఎంపీపీ కలగ లక్ష్మీ గున్నయ్యనాయుడు, అరోబిందో ప్రతినిధులు నిత్యానంద రెడ్డి, శరత్‌చంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్ల శ్రీనివాసరావు, మలసాల కిషోర్, మండల ఉపాధ్యక్షులు నమ్మి మీనాగణేష్, పెంట కోట జ్యోతి శ్రీనివాసరావు, ఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై జెసికి ఫిర్యాదు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్పందన కార్యక్రమంలో ఇచ్చిన అర్జీకి స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, రేబాక మధుబాబు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవికి ఫిర్యాదు చేశారు. గతేడాదిలో ఇచ్చిన పిర్యాదుకు ఐకేపి అధికారులు నేటికీ స్పందించ లేదన్నారు. గతవారం సంక్షేమ హాస్టళ్లలో అసౌకర్యాలపై ఫిర్యాదు చేశామన్నారు. ఎలక్ట్రికల్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఆ ఫిర్యాదులో వెల్లడించారు. పరీక్షల సమయం కాబట్టి పర్యవేక్షణ మరింత పటిష్టం చేసేందుకు సన్నాహాలు చేయాలని డిమాండ్ చేశారు.

మెడల్స్, సర్టిఫికెట్లు చూపుతున్న డ్రాగన్ లైన్స్ విద్యార్థులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పరవాడ : శ్రీకాకుళంలో సన్ స్కూల్‌లో జరిగిన రెండో ఎపి స్టేట్ డ్రాగన్ రియాన్ ఛాంపియన్ షిప్- 2024 కరాటే పోటీలలో పరవాడ మండలం, సమ్మంగిపాలెం, జాలారిపేట, కోరంగిపాలెం, మంగప్పగారివూరు గ్రామాలకు చెందిన డ్రాగన్ లైన్స్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన పి ప్రకాష్, కె జ్యేష్ఠ, కె మనోజ్, ఒ వినోద్, ఎస్ హరిషత్, టి రుషి, కె ఆదిత్య, ఆర్ మహేంద్ర, ఎస్ జస్వంత్, బంగారం, వెండి, రజిత పతకాలు సాధించారు. వారిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, గ్రాండ్ మాస్టర్ యస్ నూకరాజు, ఒలిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ విద్యార్థులు...

కశింకోట : ఇటీవల రాజాంలో జరిగిన కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిలో తామెస్వెర అభిరామ్ సాయి, ఏ లలిత స్వర్ణ పతకాలు, కె.ప్రణీత, అరోధ్య దీక్షిత్ వెండి పతకాలు సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ రూపానంద, అకడమిక్ ఇన్‌ఛార్జ్ సిహెచ్ చంద్ర మౌళి, కరాట్ కోచ్ సిహెచ్ సూరి అప్పారావు సోమవారం అభినందించారు.

విజేతలతో సెయింట్ జాన్స్ యాజమాన్య ప్రతినిధులు

నేడు పలు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలం కాజీపాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట, ఎర్రవరం, మల్లవరం, ఎం.జగన్నాథపురం, చీమలపల్లి, చౌడపల్లి, మడుతూరు, ఆవ సోమవారం తదితర గ్రామాలలో నిర్మించిన పలు భవనాలను మంగళవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేశారు.

ఎంవిఆర్ ఆధ్వర్యాన రూపాయికే మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని భీముని గుమ్మం వద్ద ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు "ఎంవిఆర్ ఆహార యోజన" కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద ఒక్క రూపాయికే మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ముందుగా భీమునిగుమ్మం వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చటం, లేనివాడి కడుపు నింపడం, ఇదే నిజమైన మాధవ సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, ఎంవిఆర్ సంజు టీం సభ్యులు పాల్గొన్నారు.

భోజనాలు వడ్డిస్తున్న ఎంవిఆర్, ఆయన తనయుడు

విద్యార్థులు, గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చర్యలు

జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

జిల్లాలో విద్యార్థులు, గర్భిణులు రక్తహీనతకు గురి కాకుండా ప్రణాళికాయుతంగా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. ఈ విషయమై సోమవారం ఆయన జిల్లాలోని పిహెచ్‌సిల డాక్టర్లు, మండల విద్యాశాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏయే గ్రామాలు, సచివాలయ పరిధిలో రక్తహీనత వున్నదో గుర్తించి తగిన పౌష్టికాహారం అందించాలని, మందులు వాడేవిధంగా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను గూర్చి మండలాలు, పాఠశాలల వారీగా సమీక్షించారు. తరువాత గర్భిణుల గురించి చర్చించారు. కొన్ని మండలాలు, ప్రాంతాలలో రక్తహీనతకు గల కారణాలను విశ్లేషించి తగిన విధంగా తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలు, వసతి గృహాలలో వున్న విద్యార్థులకు, గర్భిణులకు పౌష్టకాహారంపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ద్వారా తగిన అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.హేమంత్, జిల్లా విద్యాధికారి వెంకటలక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమాధికారి అనంతలక్ష్మి, జిల్లాలోని మండల విద్యాధికారులు, పిహెచ్‌సిల డాక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడి చేసిన వైసిపి కార్యకర్తలను అరెస్టు చేయాలని ఆందోళన

అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసిన వైసిపి కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ జర్నలిస్టు సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో సోమవారం జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఎఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.కాంతారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టుపై భౌతిక దాడికి దిగడం భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఈ తరహా దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ వెంకట్, జర్నలిస్టులు మద్దాల రాంబాబు, జోగా వెంకటేష్, భాస్కరరావు, చక్కా సుశీల్ కుమార్, అవ్వా కొండబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాప్ ఆధ్వర్యాన...

ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై జరిగిన దాడిని ఖండిస్తూ జాప్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి వెంకట్రావు, కొవ్వూరు రమేష్ మాట్లాడుతూ రాజకీయాన్ని రాజకీయంగా తేల్చుకోవాలని, ఇలా సంస్థల్లో పనిచేసే జర్నలిస్టులపై దాడి చేయడం అన్యాయమని పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించినా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిరాం, విజయ్ కుమార్, రామచంద్రరావు, రాజేష్, మాణిక్యం, సత్యనారాయణ, పిఆర్ఓ అజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విలేకర్లు నిరసన

నర్సీపట్నం టౌన్ : అనంతపురం జిల్లా ఎబిఎన్, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ జర్నలిస్టులు కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణపై దాడి చేసిన వైసిపి అనుచరులను, అందుకు ప్రోత్సాహించిన నాయకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాబ్జీ, రామకృష్ణ, విజయ్, రామగణేశ్వరరావు, శ్రీను, ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వరహాలబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్‌పై దాడి దారుణం

భీమునిపట్నం : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో వైసిపి నాయకులు, కార్యకర్తలు చుట్టు ముట్టి దాడి చేసి రక్తం కారేలా కొట్టడాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఈ తరహా దాడులను ఏ ఒక్కరూ సహించరని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పద్మనాభం : బ్రిటిష్ పరిపాలన కాలంలోనూ మీడియా వారికి విలువ ఉండేదని, ఇప్పుడు వైసిపి ప్రభుత్వంలో మాత్రం దాడి చేసి చంపేసిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మండల తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. మీడియాపై వైసిపి విధానాలను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కె.రమణ, జెడ్పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, నాయకులు కె.నగేష్‌కుమార్ సంయుక్తంగా ఖండించారు. మీడియాపై దాడి నేరమన్నారు.

పెతకంశెట్టి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెతకంశెట్టికి ఘన నివాళి

ప్రజాశక్తి- మునగపాక : పార్లమెంట్ మాజీ సభ్యులు కీర్తిశేషులు పెతకంశెట్టి అప్పలనర్సింహం జయంతి సందర్భంగా మండలంలోని నాగులాపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పలువురు టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో నిస్వార్ధ రాజకీయాలకు కేరాఫ్ అడ్రాస్ అప్పలనరసింహమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాసరావు, పిఏసిఎస్ అధ్యక్షులు మళ్ల ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ యల్లపు వెంకట భాస్కరరావు, పెతకంశెట్టి రాజునాయుడు, దాడి ముసిలినాయుడు, యల్లపు వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంపిపి రాజేశ్వరి దంపతులు

హనుమాన్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లిలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద 36 అడుగుల హనుమాన్ విగ్రహం నిర్మాణానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు దంపతులు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, చిటికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుండి ఉమామహేశ్వరిదేవి తీర్థం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి గ్రామంలో శ్రీఉమామహేశ్వరి దేవి తీర్థ కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 20న మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, అనంతరం రాత్రి 7.30 గంటలకు అమ్మవారి కళ్యాణ మహోత్సవం జరగనున్నట్లు పేర్కొంది. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ కమిటీ సభ్యులు వెల్లడించారు.

స్నేహితుడిని కోల్పోవడం బాధాకరం

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : స్నేహితుడిని కోల్పోవడం బాధాకరమని పలువురు బాల్యమిత్రులు పేర్కొన్నారు. దేబారి రమేష్ ఇటీవల మరణించగా, చోడవరంలోని మాధవ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన రమేష్ పెద్ద కర్మ కార్యక్రమంలో ఆయన బాల్య మిత్రులు పాల్గొన్నారు. రమేష్ చిన్న తనం నుండి నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి అని, ఆయన చోడవరంలోనే వివిధ దశలలో చదువులు పూర్తి చేశారని చెప్పారు. ఖజానా శాఖలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ఆయన విశాఖ జిల్లా ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ కార్యదర్శిగా కొనసాగుతూ వచ్చిరని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన ఎంతో మంది ఉద్యోగస్తులకు ప్రభుత్వం నుండి రావాల్సిన ఆర్థిక వనరులు రప్పించడంలో రమేష్ చేసిన మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ట్రెజరీ ఉద్యోగులు, బంధువులు, కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మిత్రులు

ఎపిపిఎస్‌సి పరీక్షలు సజావుగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ జాహ్నవి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో ఈనెల 25వ తేదీన నిర్వహించే ఎపిపిఎస్‌సి పరీక్షలు సజావుగే జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో ఈ విషయమై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముందస్తు ఏర్పాట్లలో చిన్న పొరపాటుకు కుడా ఆస్కారమియ్యకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెంలలో 33 విద్యా సంస్థల్లో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షా కేంద్రాలలో తగిన మౌలిక వసతులు ముందుగా కల్పించాలన్నారు. పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 10,627 మంది అభ్యర్ధులు హాజరవుతారని తెలిపారు. రూట్ ఆఫీసర్స్ అయిన జిల్లా అధికారులు, లైజన్ అధికారులైన తాశీల్దార్లు, ఎంపిడివోలు వారికి కేటాయించిన పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సెక్షన్ సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, ఎస్‌ఎ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల నాయకులతో ఎమ్మెల్యే సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వైసిపి నాయకులతో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం మండలంలోని దలాయిపాలెంలోని తన గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావడానికి పార్టీ నాయకులతో ముఖాముఖి చర్చించారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పిటిసి పిఎస్.రాజు, పార్టీ సీనియర్ నాయకులు చుక్క రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షులు కోన రామారావు, వైస్ ఎంపీపీ భూన అప్పలరాజు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెన్నల అప్పారావు, గొర్లి గోపి, పెదిశెట్టి శేఖర్, ఎంపీటీసీ గెడ్డం పుప్పు, పిఎసిఎస్ ఛైర్మన్ బురద అప్పలరాజు, జూనియర్ అప్పలనాయుడు, కోరుకొండ వెంకట రమణ, కావలి రాజు, డెక్క శ్రీను, డెక్క నూకరాజు, భాస్కర్, వెన్నల సింహాద్రి, పైల రేగారావు, యలమర్తి బుజ్జి, పల్ల గోవింద్, బండారు క్రిష్ణబాబు, స్పీడ్ మసేన్, చిన మసేన్, తిక్కాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

విజయదుర్గ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన విజయదుర్గ ఆలయాన్ని సోమవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోన సంధ్య, జెడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎన్ కుమార్, గ్రామ సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంత సూర్యనారాయణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న గోగుల వారి కుటుంబీకుల స్థలంలో రూ.4 కోట్లతో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఎలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్, డిసిసిబి మాజీ ఛైర్మన్ యు సుకుమార్ వర్మ, ఎలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయి జీతాలకు వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

గ్రామపంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయి జీతాలు తక్షణమే ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణికి సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు నెలల తరబడి జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుచ్చయ్యపేట మండలం, బుచ్చయ్యపేట పంచాయితీలో 7 నెలలు, రావికమతం మండలం మరుపాక పంచాయితీలో 18 నెలలు, కోమలపూడి పంచాయితీలో 11 నెలలు జీతాలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఇచ్చే అతితక్కువ జీతాలు నెలల తరబడి చెల్లించకపోవడంతో కార్మికులు అప్పులు చేసి కుటుంబాలు పోషిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు జీతాలు రావడం లేదని కార్మికులను తగ్గిస్తున్నారన్నారు. బకాయి జీతాలు చెల్లించాలని, కార్మికులు తగ్గించే చర్యలు నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.చిన్నారావు, ఎం అపలరాజు, జిల్లా కమిటీ సభ్యులు యు.లోకేష్, వెంకటరమణ, ఆర్.దేముడు నాయుడు పాల్గొన్నారు.

డిపిఒకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పేదల క్లబ్‌లో పెద్దల పాగా !

అనధికారికంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం

▶▶ జూదశాలగా మార్చేసి అనధికార నిర్మాణాలు?

▶▶ టౌన్‌ప్లానింగ్ అధికారుల నోటీసుల బేఖాతరు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ముఖ్యకూడలి అబీద్ సెంటర్ సమీపంలో నాడు గ్రామపంచాయతీల హయాంలో ఏళ్ల క్రితం వృద్ధులు సేద తీరేందుకు, ఖాళీ సమయంలో అధికారులు, ప్రజలు కాలక్షేపం చేసేందుకు, చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సిటీక్లబ్‌ను ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమేణా ఆ క్లబ్‌లో పెద్దలు పాగా వేసి, జూదం, తాగుడుకు నిలయంగా జూదశాలగా మార్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల ఆ క్లబ్‌కు అనుబంధంగా అనధికార నిర్మాణాలను చేపడుతూ, అసాంఘిక కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని చూస్తున్నారని స్థానికులు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

గ్రామ కంఠస్థలం 357/3 సర్వేనెంబర్‌లో 55 సెంట్లు స్థలాన్ని క్లబ్‌కు ఉపయోగిస్తూ, ఇటీవల ఆరు షాపులను నిర్మించడమే కాకుండా మరో ఆయిదు షాపులకు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి, గతనెల 31న సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ ద్వారా ప్రొవిజనల్ ఆర్డర్ నోటీసు జారీ చేశారు. మరలా ఈ నెల 3న కన్వర్జేషన్ ఆర్డర్ నోటీసు ఇచ్చారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడం నేరమని, తక్షణమే పనులు ఆపాలని అధికారులు సూచించారు. అయినా నిర్మాణ పనులు ఆపకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర్లు స్వయంగా క్లబ్ సభ్యులను కలిసి చెప్పినప్పటికీ లెక్కచేయకుండా పనులు చేస్తూనే ఉన్నారు. అంతేకాకుండా టౌన్ ప్లానింగ్ అధికారులకు ఒక క్లబ్ సభ్యుడి నుంచి బెదిరింపులు వచ్చినట్లు తెలిసింది. క్లబ్లో అనేకమంది రాజకీయ నాయకులు సభ్యులుగా ఉన్నారని, జిల్లాకు చెందిన ఒక మంత్రి, మరో మాజీ మంత్రి తమ క్లబ్‌లో సభ్యులని, తమ జోలికి వస్తే బాగోదని హెచ్చరించినట్టు సమాచారం. భవన నిర్మాణాన్ని ఆపేది లేదని, ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకుంటామని.క్లబ్ జోలికి వచ్చి ఇబ్బందులు పెట్టవద్దని బెదిరించినట్లు తెలిసింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, అనంతరం కోర్టును ఆశ్రయించి తాత్కాలిక అనుమతులు తీసుకురావడం, ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి అనుకూలంగా ప్రవర్తించడం వీరికి అలవాటుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి సామాన్యుడు ఒక ఇల్లు కట్టుకోవాలంటే ఎన్నో అనుమతులు, పత్రాలు సమర్పించాలని కోరే మున్సిపల్ అధికారులకు. ఎన్నో రోజులుగా ఇక్కడ షాపులు నిర్మాణాలు చేపడుతున్న ప్పటికీ ఉదాసీనంగా వ్యవహరించడం వలనే ఇటువంటి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఇప్పటికైనా పెద్దలు, అధికారులు కల్పించుకొని మున్సిపాలిటీకి లేదా పట్టణంలో సామాజిక సాంస్కృతిక, బాలోత్సవం కార్యక్రమాలు నిర్వహించే సంఘాలకు ఇస్తే మంచిదని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు చేపడతారో వేచిచూడాలి. అలాగే దీనికి సంబంధించి క్లబ్ నిర్వాహకుల వివరణ తెలియాల్సి ఉంది.

నోటిసులు జారీ చేశాం

మునిసిపాలిటీ అనుమతులు లేకుండా భవనాలు నిర్మించడం చట్టరీత్యా నేరం. ప్లాన్ లేకుండా నిర్మాణం చేపడితే నిబంధనల ప్రకారం తొలుత ప్రొవిజనల్ ఆర్డర్ నోటీసు, కన్వర్జేషన్ ఆర్డర్ నోటీసు ఇచ్చాం. తదుపరి చర్యగా స్పీకింగ్ ఆర్డర్ ఇస్తాము.

వెంకటేశ్వర్రావు, టౌన్ ప్లానింగ్ అధికారి

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

క్లబ్ సభ్యుల విలాసాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు రాజకీయ నేతల అండదండలతో బహుళ వ్యాపార సముదాయాలను నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలి. ప్రజా ప్రయోజనాలకు ఈ స్థలాన్ని వినియోగించాలి.

కె శివ నారాయణరాజు, కార్యదర్శి పన్ను చెల్లింపుదారుల సంక్షేమ సంఘం, నర్సీపట్నం.

అబీద్ సెంటర్‌కు సమీపంలో ఉన్న సిటీ క్లబ్‌లో అక్రమ నిర్మాణాలు

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

కోటవురట్లలో వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి -కోటవురట్ల: సచివాలయ పరిధిలో వాలంటీర్ల సేవలు మరువలేనివని వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు, సోమవారం పందూరు, అన్నవరం, బోడపాలెం, పాములవాక, సచివాలయాల పరిధిలోని గ్రామాలలో సేవలందిస్తున్న వాలంటీర్లకు సేవా ప్రోత్సాహకాలను అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ల వ్యవస్థతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని వారి సేవలను ప్రభుత్వం గుర్తించి, వారిని గౌరవించి, అభినందనలు తెలియజేస్తోందన్నారు. ఈ సందర్భంగా అన్నవరం గ్రామానికి13, పాములవాక 19, బోడపాలెం 22, పందూరు 20, మంది వాలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పందూరు సర్పంచ్ జగదీష్, అన్నవరం సర్పంచ్ సుబ్బలక్ష్మి, బోడపాలెం సర్పంచ్ ఎరుకు నాయుడు, కార్యదర్శులు స్వామి నాయుడు, జోష్న, గ్రామ రెవెన్యూ అధికారులు ఆషా, దొర పలువురు గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని కొత్తమల్లంపేట సచివాలయంలో సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు సేవామిత్ర కింద రూ.15వేలు ప్రశంసాపత్రాలు అందజేశారు. శాలువా కప్పి సన్మానించారు. వైసిపి సీనియర్ నాయకులు బొడ్డు ఎర్రినాయుడు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా వాలంటీర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

పరవాడ : సచివాలయ పరిధిలో పని చేసే గ్రామ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను పరవాడ మరిడిమాంబ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతుల మీదుగా అందజేశారు. పరవాడ మండలంలో 286 మంది వాలంటీర్లు ఎంపిక కాగా, ఇందులో సేవా వజ్ర ఇద్దరికి, సేవా రత్న ఐదుగురికి, మిగిలిన 279 మందికి సేవా మిత్ర అవార్డులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరంలో సోమవారం జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మండలంలో పలు గ్రామాలకు చెందిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, వైసిపి నేతలు సబ్బవరపు ముత్యాల నాయుడు, క్రి బాబు, వడ్డాది అప్పలరాజు, రాపేటి రాము, బైలపూడి దేముడు బాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : సేవా వజ్రా, సేవ రత్న, అవార్డులకు ఎంపికైన వాలంటీర్లు వల్లా రాజు, కందుల పరమేశ్వరులకు స్థానిక సచివాలయం-2లో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, ఎంపీడీవో సిహెచ్ సుబ్బులక్ష్మి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి - రావికమతం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో మండల వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గెంజ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వికలాంగులకు ఇస్తున్న మాదిరిగా రాష్ట్రంలో వికలాంగుల పెన్షన్‌ను రూ.ఆరు వేలకు పెంచాలని, వికలాంగుల సంక్షేమ శాఖకు తగిన బడ్జెట్ కేటాయించాలని, వికలాంగులకు ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ , ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇవ్వాలని, వికలాంగులకు 35 కేజీల బియ్యం ఇచ్చే అంత్యోదయ కార్డులను మంజూరు చేయాలని, నామినేటెడ్ పోస్టుల్లో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, అన్ని రకాల ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, 75శాతం రూ. ఐదు లక్షల వరకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని, వికలాంగులకు పెళ్లి చేసుకునే సకలాంగులకు రూ.3లక్షల కళ్యాణ కానుక ఆర్థిక ప్రోత్సాహకం అందజేయాలని, ప్రతి మండల కేంద్రంలోనూ వికలాంగులకు ప్రత్యేకంగా సామాజిక భవనాన్ని మంజూరు చేయాలని, మెరుగైన విద్య, వైద్యం బ్యాక్‌లాగ్‌పోస్టుల భర్తీ, అర్హులకు త్రీవీల్ స్కూటీలతోపాటు ఉపకరణాలను మంజూరు చేయాలని కోరారు. అనంతరం .పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎంపిడిఒ భానోజీరావు, తహశీల్దారు రమణారావులకు అందజేశారు. వికలాంగుల సమస్యలన్నిటిని జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి వియ్యపు ముసలి నాయుడు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన జూపూడి క్షమాపణ చెప్పాలి

దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అంబేద్కర్‌ను అవమానించిన జూపూడి ప్రభాకరరావు తక్షణమే క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు గాతాడ సహదేవుడు మాట్లాడుతూ, అంబేద్కర్ పేరు తీసేసి ఎవరి పేరు పెట్టినా పరవాలేదనడం సరైంది కాదన్నారు. తక్షణమే జూపూడి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే దళితులందరూ జూపూడిని బహిష్కరిస్తామన్నారు. సీనియర్ దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు మాట్లాడుతూ పదవుల కోసం జాతినే తాకట్టు పెట్టే విధంగా మాట్లాడటం అత్యంత నీచమైన చర్య అన్నారు. చేతనైతే 27 దళిత సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని సీఎం కాళ్ళు పట్టుకుంటే బాగుండేదన్నారు. తక్షణమే జూపూడి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా కెవిపి

ప్రజాశక్తి -కోటవురట్ల : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా కోటవురట్ల గ్రామానికి చెందిన కొప్పెర్ల వెంకటపతి రాజును నియమించారు. ఆ మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. , ఈ సందర్భంగా వెంకటపతి రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బిజెపి పదేళ్ల పాలనలో దేశం అధోగతి పాలైందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి-మాకవరపాలెం : మండలంలో శెట్టిపాలెం పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ మురళీమోహన్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ, వీఆర్ఓలకు పోలింగ్‌పై అవగాహన కల్పించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్ ఉండేలా చూడాలన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లు రామనాయుడు పాల్గొన్నారు

నేడు శంఖారావం సభ

ఏర్పాట్లకు శ్రీకారం చుడుతున్న గవిరెడ్డి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఈ నెల 20న నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టంలో జరిగే నారా లోకేష్ శంఖారావం కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లకు నర్సీపట్నం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమౌతుందన్నారు. ఈ బహిరంగ సభకు నర్సీపట్నం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించం

ఆక్రమణదారులను హెచ్చరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని తహశీల్దార్ వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం కోటవురట్ల పంచాయితీ మర్రిచెట్టు వద్ద ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించి అక్రమణదారులతో మాట్లాడారు త్వరతగతిన ఆక్రమణలు తొలగించాలని ఆక్రమణదారులను హెచ్చరించారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపతాహసిల్దార్ సోమశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

మత్స్య ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని డిఎల్ పురంలో సోమవారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, టెక్నాలజీ విశాఖపట్నం ఆధ్వర్యంలో మహిళలకు మత్స్య ఉత్పత్తులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్‌లో భాగంగా ఎండు చేపలు అధికకాలం నిల్వ ఉంచడం, సౌకర్యవంతమైన మత్స్య ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు .నాణ్యమైన ఎండు చేపల తయారీ విధానం, రొయ్య పౌడర్ చట్నీలు తయారీపై మదర్ తెరిసా ఎస్ఎస్‌జి మహిళలకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నైపుణ్యతపై అవగాహన కల్పించుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు .మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.శిక్షణ తరగతులకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధుసూదనరావు, విజిఎఫ్ టిఒ శృతి, నక్కపల్లి అగ్రికల్చరల్ ఎఫ్‌పిసిఎల్ సిఇఒ గింజాల అప్పారావు, గింజాల వెంకటరమణ శిక్షణ కార్యక్రమం ఉద్దేశించి పలు అంశాలపై మాట్లాడారు.

పరిహారం, ప్యాకేజీ చెల్లించాకే పనులు

గ్రామసభలో అధికారులకు స్పష్టం చేసిన నిర్వాసితులు

అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : .పరిహారం, ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించే వరకు భూములు జోలికి రావద్దని నిర్వాసితులు, నాయకులు స్పష్టం చేశారు. 2013 భూసేకరణ చట్టప్రకారం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ పూర్తిగా అందించాలని కోరారు. సోమవారం మండలంలోని డిఎల్ పురంలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి పెండింగ్ పేమెంట్లు, సమస్యలను తెలుసుకునేందుకు రెవెన్యూ ఏపీఐఐసీ అధికారులు గ్రామసభ నిర్వహించారు . 2016లో ప్రభుత్వం అవార్డు ప్రకటించారని, అవార్డు ప్రకటించి ఎనిమిదేళ్లవుతున్నా నేటికీ భూములు కోల్పోయిన రైతులను, నిర్వాసితులను పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఆదుకోలేదని నిర్వాసితులు నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం దోనివానిలక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షల ప్యాకేజీ చెల్లించాలని, ఇళ్లు కోల్పోతున్న కుటుంబంలో మేజర్లందరికీ రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని, జిరాయితీ భూములతో సమానంగా డిఫారం, సాగు భూములకు ఎకరాకు రూ.18 లక్షల నష్టపరహారం చెల్లించాలని, జిఒ ఎంఎస్ నెంబర్ 268 ప్రకారం చెట్లకు నష్ట పరిహారం పెంచి చెల్లించాలని,డిఫారం ,సాగు భూములలో ఉన్న చెట్లు కూడా చెల్లించాలని, ఇల్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ10 సెంట్లు ఇంటి స్థలం,మెరుగైన పునరావాసం కోరిన చోట ఇవ్వాలని,

ఆర్ కార్డులు ఇవ్వాలని, పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యాలకు నష్టం కలిగించే బల్క్ డ్రగ్స్, ఫార్మా, రసాయన కంపెనీలు నెలకొల్ప వద్దని, బోరుబావులకు, నేలబావులకు ,రైతుల పశువుల పాకులకు పూర్తిస్థాయిలో నష్టపరహారం చెల్లించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో డి ఎల్ పురం గ్రామ సర్పంచ్ కిల్లాడ కష్ణ, ఎంపీటీసీ సభ్యులు కొండ్ర కనకారావు, మండల కో ఆప్షన్ సభ్యులు లోడగల చంద్రరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు, గింజాల లక్ష్మణరావు, గింజాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు .

పీజీ కోర్సులు అందుబాటులోకి తేవాలి / ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గీతాకృష్ణ

ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో పీజీ, ఎంబీఎ, ఎంసీఎ, ఎంఎస్సీ ఇతర కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ కోరారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గీతాకృష్ణ మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో డిగ్రీ ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులు సుమారు 5వేల మంది వరకు ఉన్నారన్నారు. వీరు డిగ్రీ పూర్తయ్యాక పీజీ చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దూర ప్రాంతాల వల్ల పీజీ చదువులకు వెళ్లలేని పరిస్థితులలో విద్యార్థులు చదువు ఆపివేయడం జరుగుతుందన్నారు. కావున ఎంఎస్సీ, ఎంబీఎ, ఎంసీఎ, ఇతర పోస్టుగ్రాడ్యుయేట్, ప్రొఫెషనల్ కోర్సులను నర్సీపట్నంలో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల సెక్రటరీ రాజుబాబు, డివిజన్ సభ్యులు ఉపేంద్ర, జనార్ధన్, విజయ్, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి

సుదర్శనరావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-మాకవరపాలెం : మాకవరపాలెం పంచాయతీ కార్యదర్శి సుదర్శనరావు అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సుదర్శనరావు మాకవరపాలెం పంచాయతీ కార్యదర్శిగా రెండేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల కిందట ఆయన బ్రెయిన్‌కు చికిత్స జరిగింది. కోలుకుంటూ సోమవారం తెల్లవారుజామున చనిపోయినట్టు తోటి పంచాయతీ అధికారులు తెలిపారు. సుదర్శనరావు మృతితి తోటి పంచాయతీ కార్యదర్శులతోపాటు పలువురు ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యం కావాలి

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి : కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీను పిలుపు నిచ్చారు. సోమవారం సాయంత్రం నక్కపల్లిలో జిల్లా ఉపాధ్యక్షులు మేడేటి శంకరరఘురాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపిసిసి అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల పార్టీ పగ్గాలు చేపట్టినతర్వాత కాంగ్రెస్ పార్టీలో పునరుత్తేజం వచ్చిందన్నారు. .రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టించి పనిచేసే, పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుమ్మడి గోవింద్ ,చింతకాయల సింహాద్రి, ప్రగడ చక్రరావు పాల్గొన్నారు .

BHARAT CO-OPERATIVE HOUSE BUILDING SOCIETY LTD.
B - 1878, Thadi, Anakapalli District.
Off : 58-15-3/2, Gowrinagar, Butchirajupalem, VSP

CORRIGENDUM
This is to the inform that our **General Body Meeting** will be held on **10-03-2024** But it was wrongly published in Prajasakti (On 18-02-2024) Newspaper as 20-03-2024.
So all the members are requested to note that our GENERAL BODY MEETING will be held on 10-03-2024 (Sunday) by10.00 A.M. At Hotel Diamond Pearl, Sankaramatham, Visakhapatnam. And All the Agenda matter Remains the same.

P.RADHA KRISHNA MURTHY
Secretary
Cell : 9392759858

S.S.S.HARINATH BABU
President
Cell : 9848355376

భూవివాదంపై అధికారుల సర్వే

సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి -చీడికాడ : మండలంలోని మంచాల గ్రామంలో అంగన్వాడీ భవనాన్ని కేటాయించిన స్థలాన్ని వేరొక వ్యక్తి ఆక్రమించారంటూ గ్రామంలో కొందరు వ్యక్తులు ఫిర్యాదు మేరకు, తహసిల్దార్ ఆదేశాలతో సోమవారం మండల, గ్రామ సర్వేయర్లతోపాటు ఇతర సిబ్బంది సర్వే చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీకి కేటాయించిన ఆరు సెంట్లు స్థలంలో కొంత ఆక్రమణకు గురైనట్లు గ్రామ పెద్దల ఫిర్యాదుతో సర్వే చేశామన్నారు. తమ సర్వేలో అంగన్వాడీకి కేటాయించిన స్థలంలో కొంత భాగాన్ని ఆచారి ప్రసాద్ ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించామన్నారు.
కాగా ఆక్రమించారని ఆరోపణలున్న ఆచారి ప్రసాదు, తాము 30ఏళ్లుగా ఇదే స్థలంలో నివసిస్తున్నామని, అప్పట్లో ఆ స్థలాన్ని వేరొక వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదుతోపాటు 1బి, ఆడంగులు కూడా ఉన్నాయన్నారు. ఇన్నాళ్లుగా ఆక్రమణ వ్యవహారం బయటకు రాకుండా ఇపుడు ఇలా తమను వీధిలోకి లాగడం సరికాదన్నారు దీనిపై మండల సర్వేయర్ స్పందిస్తూ, తాము సర్వే చేసిన వివరాలను తహశీల్దార్‌కు నివేదిస్తామని, అవసరమైతే మరోమారు రోవర్‌తో సర్వే చేసి ఇరువురికీ న్యాయం చేసే చర్యలు చేపడతామన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని సీహెచ్ లక్ష్మీపురంలో సోమవారం గ్రామ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాజమహేంద్ర వరానికి చెందిన ఆమంచి ఆంజనేయులు గురుస్వామి కల్యాణోత్సవాన్ని శాస్రోక్తంగా నిర్వహించారు . పెద్ద సంఖ్యలో దంపతులుకల్యాణోత్సవంలో పాల్గొన్నారు .కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
అగనంపూడి, కూర్మన్నపాలెం, పూర్ణామార్కెట్, వన్‌టౌన్, అల్లిపురం, సాగర్‌నగర్, డాబాగార్డెన్స్, మద్దిలపాలెం, సిరిపురం, ఎ.యు., క్రైం రిపోర్టర్, జిల్లా పరిషత్, రాంపురం, ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి రూరల్
ఇంటర్వ్యూ : తేది 26-02-2024 సోమవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 94900 99125, 94915 70765
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46